చురుగ్గా అభివృద్ధి పనులు

- 45వ వార్డులో సెప్టిక్ ట్యాంకుల నిర్మాణం
- సమస్య పరిష్కారంతో స్థానికుల హర్షం

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. తాటిచెట్లపాలెం దరి పలు ప్రాంతాల్లో సెప్టిక్ ట్యాంకులు నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ పనులను ప్రారంభించారు. రామచంద్రనగర్, సంతోషిమాత కాలనీల్లోని ప్రజలు తమ ఇళ్లకు సెప్టిక్ ట్యాంక్ సదుపాయం లేక చాలా ఏళ్లుగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వార్డు పర్యటనలో ఈ సమస్యను గుర్తించిన జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కంపా హనోకు దీనికి సంబంధించిన ఫైల్‌ను తయారు చేయాలని సచివాలయం, జీవీఎంసీ సిబ్బందికి సూచించారు. ఆయన చొరవతో సెప్టింక్ ట్యాంక్‌ల నిర్మాణాలకు సంబంధించి ఇటీవల జీవీఎంసీ రూ.10 లక్షల నిధులు మంజూరు చేసింది. ఇటీవలే ఈ పనులను కార్పొరేటర్ హనోకు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణల చేతుల మీదుగా ప్రారంభించారు. స్థానికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు హనోకు సూచించారు. వెంటనే పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ అతి తక్కువ సమయంలోనే రామచంద్రనగర్ సెప్టిక్ ట్యాంక్ నిర్మాణం పూర్తిచేశారు. సంతోషిమాత కాలనీలో కూడా పనులు తుది దశకు చేరుకున్నాయి. దీర్ఘకాలంగా తాము ఎదుర్కొంటున్న సమస్య తమ కళ్ల ముందు పరిష్కారమవుతుండటంతో ఆయా కాలనీ లవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



రామచంద్రనగర్‌లో నిర్మించిన సెప్టిక్ ట్యాంక్



సంతోషిమాత కాలనీలో తుది దశలో సెప్టిక్ ట్యాంక్

తక్షణం స్పందించారు



మా ప్రాంతంలో కొన్నేళ్లుగా సెప్టిక్ ట్యాంక్‌లు లేక ఇబ్బంది పడ్డాం. ఈ సమస్యను కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే ఆయన స్పందించి ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయించారు. మిగిలినవి కూడా పూర్తయి అందుబాటులోకి రావాలని కోరుకుంటున్నాం. సమస్య పరిష్కారమవడం సంతోషంగా ఉంది.

– మాతా ఈశ్వరరావు, రామచంద్రనగర్

త్వరలోనే అందుబాటులోకి..



సెప్టిక్ ట్యాంకుల సమస్యను ఆయా కాలనీల వాసులు తెలియజేశారు. మొదట్లోనే ఈ పనులను ప్రతిపాదించాం. మధ్యలో కరోనా కారణంగా ఆలస్యం జరిగింది. సంతోషిమాత కాలనీలో సెప్టిక్ ట్యాంక్ కనెక్షన్లకు మరమ్మతులు చేయించాం. ఈ రెండు కాలనీల్లో సెప్టిక్ ట్యాంక్‌లు త్వరలోనే అందుబాటులోకి వస్తాయి.

– కంపా హనోకు, కార్పొరేటర్, 45వ వార్డు

క్లుప్తంగా

మహా అన్నదానం రేపు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణోత్సవాల అనంతరం ఏర్పాటు చేసే మహా అన్నదాన కార్యక్రమం ఈ నెల 7న నిర్వహిస్తామని ఆలయ నిర్వాహకులు తెలిపారు. సుమారు 5,000 మంది భక్తులకు ఆదివారం మధ్యాహ్నం అన్నదానం చేస్తారు. తుమ్మల చంద్రశేఖర్, రాజేశ్వరి దంపతులు ఆర్థిక సాయం అందిస్తారు. స్వామికి శనివారం ఉదయం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. ఆలయంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఉంటుంది.

ఘనంగా బుద్ధ జయంత్యుత్సవం



మహిళకు చీర అందిస్తున్న అతిథులు

కంచరపాలెం: ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ఆధ్వర్యంలో వైశాఖ శుద్ధ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం బుద్ధ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో బౌద్ధ బిక్షువు బాంతేజీ ప్రత్యేక పూజలు చేశారు. 55వ వార్డు కార్పొరేటర్ శశికళ మాట్లాడుతూ సమాజంలో బుద్ధుడికి గౌరవమైన స్థానం ఉందన్నారు. సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. ఆమె చేతుల మీదుగా పేద మహిళలకు చీరలు, వృద్ధులకు ఆహారం పొట్లాలు పంపిణీ చేశారు. సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్, భీమారావు తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందిస్తున్న కృష్ణారావు, కీర్తి పట్నాయక్

మురళీనగర్: వేసవి వేడిమి నుంచి ఉపశమనం కల్పించేందుకు శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం మురళీనగర్‌లో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షురాలు కుప్పిలి కీర్తి పట్నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు కృష్ణారావు మాస్టారు చేతుల మీదుగా మజ్జిగ ప్యాకెట్లు అందించారు. కార్యక్రమంలో 50వ వార్డు శానిటరీ సూపర్‌వైజర్ సింహాచలం, శ్రీ వినోద్, మాధురి, సంస్థ సభ్యురాలు ఫణిభూషణి పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరీ



కీర్తనలు ఆలపిస్తున్న గాయని శారద

సీతంపేట: వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లలితానగర్ లలితా పీఠంలో కర్ణాటక గాత్ర కచేరీ నిర్వహించారు. వీరగంట లలితా చంద్రశేఖర్ శిష్యురాలు కొంపెల్ల లక్ష్మి శారద తన అద్భుత గాత్రంతో ప్రేక్షకులను అలరించారు. నీవే నన్ను, శ్రీవిఘ్న రాజం భజే, గౌరీ సుకుమారి, శ్రీకమలాంబికే, పామర జానపాలిని, మంగళదాయిని వంటి ముత్తుస్వామి దీక్షితార్, బాల సుబ్రహ్మణ్యం ఆలపించిన పలు గీతాలను పాడి భక్తులను ఆకట్టుకున్నారు. ఈమెకు సరస్వతుల పార్థివ వయోలిన్‌పై, చైతన్య తాలాడ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని శారదను సత్కరించి అభినందించారు.

12న చందనోత్సవం

పద్మనాభం: పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామికి ఈ నెల 12వ తేదీన చందనోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చురుగ్గా చేస్తోంది. చందనోత్సవం గతంలో ఎన్నడూ నిర్వహించలేదు. ఈ ఏడాది నుంచి చందనోత్సవం నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి కుంతీ మాధవ స్వామి చందన అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని కమిటీ సభ్యులు తెలిపారు.

వైభవ వేంకటేశ్వరుడికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో వైశాఖ మాసం పౌర్ణమి సందర్భంగా శుక్రవారం శ్రీవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సేవలో పాల్గొన్న దాతలు, భక్తులు, అర్చకులు మంగళధ్వనితో వేద మాంత్రోచ్చారణల మధ్య ఆలయ అభిషేక ప్రదక్షిణ చేశారు. అనంతరం పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో స్వామికి అభిషేకం చేశారు. ఉదయం 8.30 గంటలకు స్వామి నిజపాద దర్శనం, 10.30 గంటలకు అలంకార దర్శనం భక్తులకు కల్పించారు. అనంతరం అర్చన చేశారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆర్జిత సేవలో పాల్గొన్న దాతలకు శాలువా, కండువా, బ్లౌజ్, వైభవుడి చిత్రపటాన్ని అందజేశారు. మంగళశాసనాలు, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించారు.



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, అర్చకులు

లలితా పీఠంలో వైశాఖ పౌర్ణమి వేడుకలు



నవావరణ పూజలు చేస్తున్న అర్చకుడు

సీతంపేట: వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం లలితానగర్ లలితా పీఠంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శ్రీలక్ష్మీ నరసింహస్వామికి అభిషేకం, అర్చన జరిపించారు. పండితుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం మణిద్వీపంలో మహా మేరువుకు శ్రీచక్రనవావరణ అర్చన నిర్వహించారు. పీఠం దర్బారు హాల్లో షోడసి సహిత లలితాదేవి హోమం జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సుబ్రహ్మణ్య స్వామికి విశేష పూజలు

కంచరపాలెం: వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దేవాల రాజుకృష్ణ నేతృత్వంలో కలశ స్థాపన, విఘ్నేశ్వర పూజ, మండపారాధన, ముత్తయిదువుల చేతుల మీదుగా ఊంజల సేవ చేశారు. స్వామికి క్షీర, పంచామృతాభిషేకాలు, స్కందవేద హోమం జరిపారు. 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజని సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు కాండ్రేగుల రాము, సిహెచ్.కుమారి, కె.రవి, సిహెచ్.సురేష్ శర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు.



సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ చల్లా రజని

నేత్రపర్వంగా రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రిల్ చర్చిలో శుక్రవారం పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో రక్షణగిరి పుణ్యక్షేత్ర మహోత్సవం, క్రీస్తు రక్షకుని యాత్రా ఉత్సవాలు ఘనంగా ప్రారంభించారు. ప్రతి ఏటా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో ఫాదర్ సరసా ప్రతాప్ పతాకావిష్కరణ చేశారు. జపమాల, దివ్య బలి పూజలు నిర్వహించారు. అనంతరం నవదిన ప్రార్థనలు ప్రారంభించారు. స్వస్థత ప్రార్థన కూటమి ప్రార్థనలు చేశారు. పుర:ప్రదక్షిణ, బైబిల్ పదకేళి పోటీలు నిర్వహించారు. 9 రోజుల పాటు జరగనున్న ఈ పోటీల్లో విజేతలకు మే 14న బహుమతి ప్రదానం చేస్తారు. కార్యక్రమంలో రక్షణగిరి పత్రిక సంపాదకులు ఆదిరెడ్డి ఆల్బర్ట్, పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) సభ్యులు ఆమర్, ఆదిరెడ్డి చార్లీ, ఆనందరావు, బేతా రాణిజోసెఫ్, గురు మండలి సలహా సంఘం సభ్యులు, క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



పతాకాన్ని ఎగురవేస్తున్న ఫాదర్ సరసా ప్రతాప్

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. రూ.500 చెల్లించిన దంపతులను లేదా ఇద్దరిని క్షీరాభిషేక సేవకు అనుమతించనున్నట్టు చెప్పారు. వివరాలకు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.



2 కేజీల గంజాయి పట్టివేత

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి గంజాయి తరలిస్తుండగా.. పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు వారు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ఏఎస్సార్ నగర్‌కు చెందిన రౌడీ షీటర్ దేవిశెట్టి ధనుంజయరావు అలియాస్ కల్యాణ్ శుక్రవారం ఉదయం ఊర్వశి జంక్షన్ వద్ద బ్యాగ్‌తో అనుమానాస్పద స్థితిలో సంచరిస్తున్నాడు. అది గమనించిన పోలీసులు అతడి బ్యాగ్‌ను తనిఖీ చేయగా.. రెండు కిలోల గంజాయిని గుర్తించారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో ఎస్‌ఐ రవికిషోర్ కేసు నమోదు చేశారు. అనంతరం ధనుంజయరావును రిమాండ్‌కు తరలించారు.

వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ‘గ్రీవెన్స్’



సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

సీతమ్మధార: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో శుక్రవారం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్ని అర్జీలను వెంటనే పరిష్కరించారు. మరికొన్ని వినతులను సంబంధిత అధికారులకు పంపించి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆంజనేయ ఆలయంలో మన్యుసూక్త హోమం



హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట: టౌన్ మెయిన్ రోడ్డులోని ఆంజనేయ స్వామి వారి దేవాలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. దీని వల్ల నర ఘోష, శత్రు ఘోష, రుణబాధ, గ్రహదోష శాంతి చేకూరుతుందని దేవస్థానం ఈవో అల్లు జగన్నాథం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు హోమం నిర్వహించారు. భక్తులు రూ.516 చెల్లించి హోమంలో పాల్గొన్నారని, అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు వారికి అందజేసినట్లు ఈవో చెప్పారు.

పబ్లిక్ డిమాండ్

భరించలేని దుర్వాసన



సీతమ్మధార రైతుబజార్‌లో మురుగు నీరు, వ్యర్థాలు

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లో మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో దుర్గంధం వెలువడుతోంది. పారిశుధ్య సిబ్బంది పట్టించుకోకపోవడంతో ఈ సమస్య నెలకొంది. మురుగు నీటి నుంచి భరించలేని దుర్వాసన వస్తోందని వినియోగదారులు, రైతులు వాపోతున్నారు. దోమల వ్యాప్తితో రోగాల బారిన పడే అవకాశముందని చెబుతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య అధికారులు, రైతుబజార్ ఈవో స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ
- ఇండస్ట్రియల్ ఏరియాలో పర్యటన

కంచరపాలెం: బహిరంగ ప్రదేశాలు, రహదారుల వెంబడి చెత్తాచెదారం, చెట్ల కొమ్మలు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పారిశుధ్య సిబ్బందికి జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ సూచించారు. 54వ వార్డు 104 ఏరియా, కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన ఆకస్మిక పర్యటన చేపట్టారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని వాకింగ్ ట్రాక్ ప్రాంతాల్లో వాకర్స్‌తోమాట్లాడారు. రాగిజావ విక్రయిస్తున్న ఓ వ్యాపారి ప్లాస్టిక్ గ్లాసులు వాడటం, రోడ్లపై అవి పడి ఉండటం చూసి మండిపడ్డారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు వినియోగించకూడదని, డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని విక్రయదారులకు సూచించారు. అనంతరం త్రీస్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు, సచివాలయ శానిటరీ కార్యదర్శులపై కమిషనర్ ఆగ్రహించారు. ఇండస్ట్రియల్ ఏరియాలో శానిటరీ సిబ్బందిని నియమించి ప్రతి రోజు ఉదయం రోడ్లను శుభ్రం చేయించాలని పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోన్-5 పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ ఎస్.జనార్దన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



డస్ట్ బిన్లు ఏర్పాటు చేయాలని విక్రయదారుడికి సూచిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

సమస్యల పరిష్కారానికే ‘గడప గడపకు’

మద్రిపాలెం: ప్రజా సమస్యల తక్షణ పరిష్కారానికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రూపొందించినట్టు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 49వ వార్డు 282 సచివాలయం పరిధి తెన్నేటినగర్, మురళీనగర్, ఎల్‌బీ నగర్, కామాక్షి నగర్ ప్రాంతాల్లో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి ఆయన పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి ఇప్పటివరకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా సంక్షేమ పథకాలు అమలుచేసి, అవి నేరుగా లబ్ధిదారులకు అందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పథకాలు అమలు, ఆయా ప్రాంతాల్లో మౌలిక వసతులు, ప్రజల సమస్యలు ప్రజాప్రతినిధులు నేరుగా తెలుసుకునేందుకే ఈ కార్యక్రమానికి సీఎం శ్రీకారం చుట్టారన్నారు. జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ, డైరెక్టర్లు ఎస్.రవికుమార్, ఐ.రవికుమార్, రాయుడు శ్రీను, 49వ వార్డు నాయకులు సరస్వతమ్మ, పి.చైతన్య, అప్పలనాయుడు, శంకర్, సునీల్, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, చిన్న, కర్రి రామారెడ్డి, కోరిబిల్లి విజయ్, గురువోజి, సత్యనారాయణ, మల్లిక్, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



49వ వార్డులో సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందిస్తున్న కె.కె.రాజు, అల్లు శంకరరావు

వేగవంతంగా స్నేపర్ పార్కు పనులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని స్నేపర్ పార్కు(రాకెట్ పార్కు) అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కార్పొరేటర్ కె.అనిల్‌కుమార్‌రాజు సూచించాచారు. జీవీఎంసీ అధికారులతో కలిసి శుక్రవారం ఆయన పార్కు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందాల విశాఖ నగరానికి మరింత వన్నె తెచ్చేలా రాకెట్ పార్కు పనులను నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. సుమారు రూ.2.5 కోట్లతో పార్కు ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. హార్టికల్చర్ డైరెక్టర్ దామోదర్ కింద స్థాయి అధికారులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాక్సర్ రాజు, పార్కు అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసరాజు, హరివర్మ, జానకీరామ్ రాజు, విశ్వనాథ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



పార్కు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్‌రాజు, అధికారులు

వాక్ ఇన్ డ్రైవ్‌కు విశేష స్పందన



మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీ సభ్యుడు సారిపిల్లి గోవింద్



ఇంటర్వ్యూలకు హాజరైన యువత

సీతంపేట: శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో 25వ వార్డు గణేష్‌నగర్‌లోని ఎస్‌కేవైఎస్ఎస్ కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన మెగా వాక్ ఇన్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మాట్లాడుతూ దేశంలో ఉపాధి అవకాశాలకు కొదవ లేదని, వాటిని అందిపుచ్చుకోవడానికి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థి దశలోనే పెంపొందించుకోవాలన్నారు. కార్పొరేట్ ఉద్యోగాల సాధనలో కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కీలకంగా మారాయని, ఆ దిశగా యువత కృషి చేయాలని సూచించారు. గ్రామాభివృద్ధితోపాటు, యువతకు ఉపాధి కల్పించేలా జాబ్ డ్రైవ్ నిర్వహించిన శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ప్రతినిధులను ఆయన అభినందించారు. అనంతరం బీపీవో, ఐటీ, ఫార్మా, ఎలక్ట్రికల్ రంగాల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో బోర ఈశ్వరరావు, బోర రమణ, సారిపిల్లి గంగరాజు, సానబోయిన సురేష్, సారిపిల్లి సంతోష్, ప్లేస్‌మెంట్ పార్క్ సీఈవో షారుక్ తిరుమాని, సమీర్ తిరుమాని, శ్రీకాంత్, గణేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల మనోవికాసానికి విస్తృత కార్యక్రమాలు

దాబాగార్డెన్స్: ‘ఈ దేశానికి మీరు చాలా అవసరం. మానసిక ఒత్తిడిలో సమాజం మీ వెంటే ఉంటుంది. ఆత్మహత్యలకు పాల్పడొద్దు. బలవన్మరణాల నివారణకు తబుల రాసా విస్తృత కార్యక్రమాలు చేపట్టనుంది’ అని ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్, సైకాలజిస్ట్ డాక్టర్ విజయభాస్కర్ బోనం తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో సామాజిక వేత్తలు, పలువురు సైకాలజిస్ట్‌లతో శుక్రవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఇంటర్మీడియట్ ఫలితాల్లో విఫలమైన విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. ఎన్‌సీబీఆర్ సర్వే ప్రకారం ప్రతి 46 నిమిషాలకు ఒక విద్యార్థి.. అంటే సుమారుగా రోజుకు 36 మంది.. ఏడాదికి 12,400 మంది చొప్పున ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, అందులో 14 నుంచి 24 ఏళ్ల వయసు వారే ఉన్నారని తెలిపారన్నారు. వీటిని శాశ్వతంగా నిర్మూలించాలంటే విద్యా సంస్థల్లోనూ, విద్యా విధానంలోనూ, మరీ ముఖ్యంగా తల్లిదండ్రులు, విద్యార్థులు, టీచర్లు అవగాహన పొందాలని పేర్కొన్నారు. విద్యార్థుల్లో మనోధైర్యాన్ని పెంచేలా, పిల్లల్లో ఇంటెలిజెన్స్‌తోపాటు ఎమోషనల్ ఇంటెలిజెన్స్, సోషల్ ఇంటెలిజెన్స్ కూడా అభివృద్ధి చేయడం చాలా అవసరమన్నారు. సైకాలజిస్ట్‌చే మెంటల్ హెల్త్ అవగాహన కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని నిర్ణయించినట్టు చెప్పారు. అందుకు తమ సంస్థ ద్వారా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. భవిష్యత్‌లో వివిధ విద్యా సంస్థలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, తల్లిదండ్రులను చైతన్య పరిచే కార్యక్రమాలు, నివారణ మార్గాలు విస్తృతంగా చేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో సామాజిక వేత్త జి.ఎ.నారాయణరావు, డాక్టర్ రాజ్యలక్ష్మి, కె.నిరుపమ, శ్రీదేవి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.